# డాక్టర్ లక్ష్మీకాన్తమ్మ గారి ప్రసంగాలు

-సాహిత్యకళా తపస్వి
జి.వి. జ్వాలానరసింహశాస్త్రి
అడ్వకేట్, బాపట్ల

షుమారు యెనిమిది దశాబ్దాలుగా, యావదాంధ్రసారస్వత సీమను, గాంగనిర్ఝర సద్వాగ్ధారలతో పరవళ్ళు త్రొక్కించిన ఏకైక మహిళామణి, ప్రాతఃస్మరణీయ డాక్టరు ఊటుకూరి లక్ష్మీకాన్తమ విదుషీమణి !

బహుముఖీనం, అతివిస్తృతం, వైవిధ్యం, గల ఆమె సారస్వత వ్యవసాయాన్ని యిదమిత్థంఅని నిర్ణయించడం అంత సులభం కాదు. కందపద్యములు, గేయాలు, వ్యాసాలు, విమర్శలు, ఉపోద్ఘాతాలు, కథా కథానికా సంపుటీ సంకలనాలు, చారిత్రక పరిశోధనలు,సూక్తి సుధలు, వచన కవితలు, ఖండకావ్యాలు, భక్తి ప్రభోధకాలు, భువన విజయరూపక పాత్రధారణలు, ఇత్యాది రచనాంశాలెన్నో చేపట్టిన ఘనత ఆమెది! అందుకు ఉచిత రీతిలో అనేక విధాలైన సన్మానాలను, బిరుదాలను గ్రహించిన సుకృతాత్ముΡాలు కూడా!

సహస్రాధిక సంఖ్యగల సభలలో, ధీర గంభీర కంఠంతో ఆమెగావించిన ప్రసంగాలు సభాస్తారుల ప్రశంసాసహస్రములకు ఆలవాలమయ్యాయి. ఈ వక్తృత్వ శక్తి, ఆమెలో ఏర్పడటానికి, ఆమె శైశవం నుండి పరిపక్వ దశనందుకునే పరిణామంలో, దేశంలోని ఉద్యమస్ఫూర్తి ఆమెపై గాఢమైన ప్రభావం చూపడం సహజమైంది. స్వామి వివేకానంద, సర్ సురేంద్రనాధ్ బెనర్జీ, ఆనీబిసెంటు, సరోజినీనాయుడు వంటి మహావక్తలు ప్రభవించి, దేశీయుల్ని కర్తవ్యోన్ముఖుల్నిగా, దేశాభిముఖుల్నిగా, చేయడానికి వినియోగించిన శక్తివంతమైన ఆయుధం; వారి వక్తృత్వ పాటవం ! ఏ సాంస్కృతిక రంగంలో నైనా నూరు గ్రంథాలు రాసి, ముద్రించి, జనులచేత చదివింపచేయడం ద్వారా పొందే ఫలితం కంటే, పది ప్రసంగాలు కొన్ని వందలలోనున్న శ్రోతల సమక్షంలో, చేయడంవల్ల వేయిరెట్ల స్పందన సిద్ధించడం గమనించవచ్చు. ఇది సాహిత్య రంగానికీ వర్తిస్తుంది. అధిక సంఖ్యలో, రాశిలో లేక వాశిలో, రచనలుచేసి, గ్రంథస్థం చేసిన కవులూ, పండితులు కంటే, ఆశుకవితా ప్రదర్శనల ద్వారా, అవధాన ప్రక్రియలద్వారా అత్యధిక ప్రయోజనాలను గాంచిన తిరుపతి వెంకట కవులవంటి వాగ్విలక్షణులను గణించవచ్చు.

లక్ష్మీ కాన్తమ్మ గారి సాహిత్య సృష్టి, మహోపన్యాసాల సృష్టిద్వారా ఆవిష్కృతమై, సహృదయుల దృష్టిలో రసపుష్టినీ, సంతుష్టినీ సంతరించుకొన్నది.

వక్తృత్వ కళాశిల్ప రహస్యములనుతెలుసుకొనడం ఒక వంతుకాగా, అందుదక్షత సంపాదించుకొనడ ంరెండవవంతు! కేవలం భాషపై అధికారము ఉన్నంతమాత్రాన, వక్త వ్యాసాన్ని సముద్దీప్తం చేయడం సులభం కాదు. సద్యోనిర్గతంగా, అనర్గళంగా ఆశువుగా వాక్యాలదొంతర్లు విసరడం, తోపాటు, పదాల పోహళింపులో, స్వరాన్ని ఆరోహణ అవరోహణలతో క్రమబద్ధం చేయడం, శబ్దాలను ధృవీకరించడం, హ్రస్వీకరించడం, ఉచ్చారణతో తూగును జొప్పించడం, అర్థ ప్రతిపత్తిని, సాధించడం, భావోన్మీలనం ద్వారా రససాక్షాత్కారానికి ప్రయత్నాలు చేయడం వంటి ఎన్నో - మెళుకువలు ఉన్నాయి. పాశ్చాత్య సంస్కృతిలో అత్యున్నతస్థితిని వక్తృత్వ కళ సాధించింది.

ఈకళ ఆమెలో పుష్కలంగా ఉంది. ఏవిషయాన్నయినా, ఆమె వాగ్వైఖరితో సమ్మిళితమైతేనే చాలు ! శ్రోతల శరీరాలు జలదరించేటట్లు, సదస్యుల హృదయాలు పులకరించేటట్లు, రసోల్లాసంతో మంత్రముగ్ధులయ్యేట్లు చేయగల నేర్పు లక్ష్మీకాన్తమ్మగారిలో ఉన్నది. అందుకే ఆమె చేసే ప్రతి భాషణం "సాహిత్యం"గా రూపాంతరం చెందుతుంది. ఆమె ప్రతి ప్రసంగం, ఒక రసగుళిక!! ఒక కవితా మయఖండిక ! ఒక వాఙ్మయ దీపిక!!

ప్రస్తుతానికి లక్ష్మీకాన్తమ్మ విదుషీమణికి ఎన్నడో చెప్పిన ప్రస్తుతిని తెల్పి "స్వస్తి" అనడం మంచిది.

"మధుర కవితయగుచు, సుధలను జిందించి,
తెలుగుజాతి కెవరు వెలుగు దెచ్చె
ప్రథితినిచ్చునామె, ప్రాజ్ఞయై, సాహితీ
ప్రథమ పీఠ మెక్కు పరమపూజ్య"

"జ్వాలా శాస్త్రి"